

విజయలక్ష్మి అలంకరణలో
లక్ష్మీతాయారు అమ్మవారు



భద్రాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు ఆదివారం విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చిత్రకూట మండపం లో శ్రీరామాయణ పారాయణం కొనసాగుతోం ది. లక్ష్మీతాయారు ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో కె.దామోదర్ రావు, వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.





కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంత్రి తుమ్మల పూజలు

ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని, దుర్గాదేవి ఆశీస్సులతో తెలంగాణ అన్ని విధాలా ముందుండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అమ్మవారిని వేడుకున్నారు. నవరాత్రులలో భాగంగా ఆదివారం నగరంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న అమ్మవారిని మంత్రి తుమ్మల దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు తుమ్మలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి.. అమ్మవారి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు.

రేపు సద్దుల బతుకమ్మ

అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు


ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మ వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా జరుపుకోనున్నారు. ఈ మేరకు నగరంలోని కాల్వొడ్డు మున్నేరు వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజుల పాటు రోజుకో రూపంలో కొలిచిన బతుకమ్మను చివరి రోజున సత్తు పిండి, పెరుగన్నం, కొబ్బరన్నం నైవేద్యంగా సమర్పించి.. సద్దుల బతుకమ్మ రూపంలో మంగళవారం జిల్లా అంతటా గంగమ్మ ఒడికి చేర్చనున్నారు. గ్రామాలలో బతుకమ్మ వేడుకల అనంతరం స్థానిక చెరువులు, కుంటలలో నిమజ్జనం చేయనున్నారు. కాగా.. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారమే సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. వాస్తవానికి సోమవారంతో తొమ్మిది రోజులు కాగా.. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. ఇది ప్రతి ఏటా జరిగే సాంప్రదాయం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30న సద్దుల బతుకమ్మ జరపాలని ఆదేశాలు జారీ చేయడంతో.. కొన్ని ప్రాంతాల్లో సోమవారం, మరికొన్ని ప్రాంతాల్లో మంగళవారం మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు.

మళ్లీ దోబూచులాట

- తగ్గుతూ.. పెరుగుతూ..
- మొదటి ప్రమాద హెచ్చరిక దాటిన గోదావరి

భద్రాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):భద్రాచలం వద్ద గోదావరిమరోసారి మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తోంది. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 42..4 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం ఆదివారం ఉదయం 42.1 అడుగులకు తగ్గింది. 9 గంటలకు 42.3 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం.. 12గంటలకు 42.6 అడుగులకు చేరుకుంది. 2 గంటలకు 42.8 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం.. మూడు గంటలకు 43 అడుగులకు చేరుకోవడంతో తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆరు గంటలకు 43.4 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరగా.. 7 గంటలకు 43.5 అడుగులకు చేరుకుంది. గోదావరి మరికొద్దిగా పెరిగి అనంతరం నిలకడగా ఉండే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

స్థానిక సంస్థల్లో కీలకమైన మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ నేడో రేపో విడుదల కానుంది. ఓ వైపు కోర్టులో వివాదం నడుస్తున్నప్పటికీ.. మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చి నామినేషన్ల కార్యక్రమానికి శ్రీకారం చుడుతుందన్న విషయం తెలియడంతో రాజకీయ పార్టీలు మండల, జిల్లా పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించాయి. పార్టీల పరంగా ఎన్నికలు జరుగుతున్నందు వల్ల అధికార, విపక్ష పార్టీలు సమరానికి సై అంటున్నాయి. ఇందుకోసం ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో 'వ్యూహరచన' చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆయా పార్టీల ముఖ్య నేతలు ఇప్పటికే తమ తమ నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించి.. రిజర్వేషన్లపై సమీక్ష నిర్వహిస్తున్నారు.



వ్యూహరచన

'స్థానిక' సమరానికి పార్టీల సై

- అందరి చూపు.. ఎంపీపీ, జడ్పీ పీఠాల వైపు..
- ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల కోసం పార్టీల వేట

ఖమ్మం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవికి రిజర్వేషన్లు ఖరారైన విషయం తెలిసిందే. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించడంతో.. ఉమ్మడి జిల్లాలో ఓసీ వర్గాలు రాజకీయంగా పోటీ చేసే అవకాశాలను చాలా వరకు కోల్పోతున్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు చాలా తక్కువ సంఖ్యలో జనరల్‌గా ఉన్నాయి. 70శాతం వరకు రిజర్వేషన్‌లో పోవడంతో జనరల్ అభ్యర్థుల ఆశలకు అడ్డుకట్ట పడినట్లయ్యింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బీసీలకు జిల్లాలో పెద్దఎత్తున రాజకీయ అవకాశాలు లభిస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ అనంతరం అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ వామపక్ష పార్టీలు సమర్థులైన అభ్యర్థుల కోసం వేట ప్రారంభించాయి. ఆయా రిజర్వుడు నియోజకవర్గాల్లో పార్టీకి అనుకూలమైన నాయకులు, వారి సతీమణుల పేర్లను పరిశీలిస్తున్నారు. ఈసారి ఖమ్మం జడ్పీ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు, భద్రాద్రి జడ్పీచైర్మన్ పదవి జనరల్‌కు రిజర్వ్ అయిన విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు జిల్లాల జడ్పీ చైర్మన్ పదవులు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారనున్నాయి. అధికార కాంగ్రెస్ జడ్పీ చైర్మన్‌లకు అర్హత ఉన్న అభ్యర్థులను అన్వేషిస్తోంది. పార్టీపరంగా పలువురు అభ్యర్థుల పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. ఖమ్మం జడ్పీ చైర్మన్ ఎస్టీ రిజర్వ్ కావడంతో.. ఎస్టీకి రిజర్వ్ అయిన జడ్పీటీసీ స్థానాలతో పాటు



జనరల్‌కు రిజర్వ్ అయిన జడ్పీటీసీ స్థానాల్లో కూడా ఎస్టీ అభ్యర్థులు బరిలో దిగి పోటీచేసే అవకాశం ఉంది. కూసుమంచి, తిరుమలాయపాలెం ఎస్టీ మహిళ, సత్తుపల్లి ఎస్టీ మహిళ, కొణిజర్ల ఎస్టీ జనరల్ లో గిరిజనులకు రిజర్వ్ అయి ఉన్నాయి. వీటితో పాటు చింతకాని, ఏన్కూరులో జనరల్, కామేపల్లి, సింగరేణిలో జనరల్ మహిళకు రిజర్వ్ అయిన చోట కూడా ఎస్టీ అభ్యర్థులు పోటీ చేసే అవకాశం ఉంది. దీంతో ఆయా స్థానాలకు డిమాండ్ నెలకొంది. ఎస్టీ రిజర్వుడు జడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాలు పాలేరు, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. దీంతో ఎస్టీకి జడ్పీ చైర్మన్ పదవి టికెట్ ఎవరికి ఇవ్వాలనుకుంటే.. వారినే అధికార, విపక్ష పార్టీలు బరిలో దించనున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు విపక్ష పార్టీలో గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించిన ఎస్టీ అభ్యర్థులు జడ్పీ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలుగా కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి, రఘురాంరెడ్డి ఉండగా.. సత్తుపల్లి, వైరా అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో జడ్పీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొనే అవకాశం ఉంటుందని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌లో జడ్పీ చైర్మన్‌కు (మిగతా 6వ పేజీలో)

పంచాయతీలకు
రిజర్వేషన్లు పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 571 గ్రామ పంచాయతీలకు 5214 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఆదివారం సాయంత్రం అధికారులు వెల్లడించారు. దీంతో జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సగమైంది. ఇక ఈ రిజర్వేషన్ల వివరాలను సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. ప్రభుత్వం రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిస్తే అన్ని జిల్లాల నుంచి రిజర్వేషన్ల ప్రక్రియ నివేదికలు అందగానే నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. నేడో రేపో నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు భావిస్తున్నారు.

జిల్లా అధికారులు నిర్ధేశించిన ప్రకారం వివరాలు ఇలా..

జిల్లాలో 571 పంచాయతీలకు గాను మొత్తం షెడ్యూల్ ట్రైబ్స్‌లో (ఏజెన్సీ ప్రాంతంలో) 48 స్థానాలు మహిళలకు, 51 పురుషులకు, వందశాతం గిరిజన పంచాయతీలలో 4 మహిళలకు, 7 పురుషులకు కేటాయించారు. మైదాన ప్రాంతంలో 291 పంచాయతీల్లో 61 షెడ్యూల్ ట్రైబ్స్, ఎస్సీలకు 110, బీసీలకు 190, ఇతరులకు 100 కేటాయించారు

- పంచాయతీల వారీగా 5214 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. వీటిలో ఎస్టీలకు 592, వంద శాతం గిరిజన పంచాయతీల్లో 84, మైదాన ప్రాంతంలో పంచాయతీల్లోని 4540 వార్డులకుగాను 486 వార్డులు ఎస్టీలకు, ఎస్సీలకు 935, బీసీలకు 1474 పంచాయతీలు, జనరల్‌కు 1361 వార్డులను కేటాయించారు. వీటితో జిల్లాలో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు.

మాలలకు తీరని
అన్యాయం

- ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానం సవరణే మా లక్ష్యం
- నవంబరు 2న హైదరాబాద్‌లో మాల మహా రణభేరి
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

7

మాయదారి
మహమ్మారి

- జిల్లాలో 210 క్యాన్సర్ కేసులు
- బాధితుల్లో అత్యధికంగా మహిళలే..
- ముందుగా గుర్తిస్తే సులువుగా నివారణ

జిల్లాలో క్యాన్సర్ బాధితులు ఇలా..

బ్రెస్ట్ క్యాన్సర్	87
సర్వైకల్ కాన్సర్	63
ఓరల్ కాన్సర్	2
ఇతర రకాల కాన్సర్లు	58
క్యాన్సర్‌తో మృతి చెందిన మహిళలు	36

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాయదారి మహమ్మారిలా క్యాన్సర్ కబళిస్తోంది. ప్రభుత్వం కొన్నేళ్లుగా అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు ఎన్సీడీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు వారి పరిధిలో అనుమానితులకు సమీప పీహెచ్‌సీలలో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. దీంతో పాటు ఆరోగ్య మహిళా కార్యక్రమంతో పాటు ఇటీవలే స్వస్థ్‌నారీ కార్యక్రమం ద్వారా క్యాన్సర్ బాధితులను గుర్తిస్తున్నారు. ఆ తర్వాత జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో పరీక్షల అనంతరం క్యాన్సర్ నిర్ధారణఅయితే చికిత్స ప్రారంభిస్తున్నారు. ఒకవేళ వ్యాధి తీవ్రస్థాయిలో ఉంటే.. హైదరాబాద్‌లోని ఎన్ఎంజే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, రీజినల్ క్యాన్సర్‌తో సెంటర్‌కు పంపించి వైద్యసేవలు అందిస్తున్నారు.

జిల్లాలోని 26 పీహెచ్‌సీలు, నాలుగు యూపీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకు 81 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించారు. అధికంగా బోనకల్, ఎంవీపాలెం, సుబ్లేడు, ఖమ్మం నగరంలోని మునిసిపల్ కార్యాలయం పట్టణ దవాఖానాలో, మంచుకొండలో అధికంగా కేసులు నమోదయ్యాయి. వీటి పరిధిలో మొత్తం 81 కేసులున్నాయి. వీరే ఎన్సీడీ ద్వారా గుర్తించిన కేసులే కాగా.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో బాధితుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే 129మంది ఉన్నారు.

ఖమ్మంలో పాలియేటివ్ సెంటర్ ద్వారా చికిత్స ఖమ్మం పెద్దాస్పత్రిలోని పాలియేటివ్ (అలన) సెంటర్‌లో క్యాన్సర్ బాధితులకు వైద్యసేవలందిస్తున్నారు. ఈ సెంటర్ ఏడు పడకల సామర్థ్యంతో ఉండగా.. ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ సేవలే కాకుండా తీవ్రత ఆధారంగా బాధితుల ఇళ్లకు వెళ్లి కూడా చికిత్స చేస్తున్నారు. సెంటర్ సిబ్బంది వాహనంలో వెళ్లి మందులు ఇస్తారు. పరిస్థితి మరింత విషమిస్తే సెంటర్‌కు తీసుకొస్తున్నారు. 2018, సెప్టెంబర్‌లో మొదలైన ఈసెంటర్ ద్వారా జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల వారు 2,111 మందికి ఇన్ పేషెంట్, 6,154 మందికి ఔట్ పేషంట్ సేవలందించారు. అలాగే వాహనంలో వెళ్లి ఇప్పటివరకు 18,028 మందికి పరీక్షలు చేశారు. కాగా.. చివరి దశలో వ్యాధిని గుర్తించి పాలియేటివ్ సెంటర్ ద్వారా చికిత్స అందుకున్న 36మంది మృత్యువాత పడ్డారని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో జిల్లావాసులే కాక పొరుగు జిల్లాల వారు ఉన్నారు.

బీపీ, షుగర్లతో సమస్యలు

మహిళల్లో రక్తపోటు, మధుమేహానికి తోడు ఇటీవల క్యాన్సర్ కేసులు కూడా (మిగతా 8వ పేజీలో)



ఖమ్మంలో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో పరీక్షలు

ముందుగా గుర్తిస్తే నివారించొచ్చు

డాక్టర్ ప్రేమలత, ఆరోగ్య మహిళా నోడల్ ఆఫీసర్



క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే ముప్పు నుంచి బయటపడొచ్చు. ప్రారంభ దశలో ఉన్న వారికి ఇక్కడ, ప్రభావం ఎక్కువ ఉన్న వారిని హైదరాబాద్ ఎన్ఎంజేలో చికిత్సకు పంపిస్తున్నాం. జిల్లాలో పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా వ్యాధి బారిన పడుతుండగా, బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ కేన్సర్ కేసులు ఉంటున్నాయి.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పదేళ్లల్లో ఇవ్వని ఉద్యోగాలను
ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చాం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- జానకీపురం, నారాయణపురం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధిలో కలిసి రావాలని ప్రతిపక్ష పార్టీలకు పిలుపు

6

ఎస్టీ జాబితా నుంచి..
లంబాడీలను తొలగించాల్సిందే..

- మా జాతి కోసం చచ్చే వరకూ పోరాటం
- సోయం బాపురావును భయపెట్టలేరు
- సుప్రీంకోర్టు నోటీసులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమాధానం ఇవ్వాలి
- అన్ని పార్టీలు సహకరించాల్సిన సమయం ఆసన్నమైంది..
- దీపావళి తర్వాత ఆదిలాబాద్‌లో సభ
- డిసెంబరు 9న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ
- భద్రాద్రి ధర్మయుద్ధం సభలో ఆదివాసీ వక్తలు
- సారపాక నుంచి భద్రాద్రి జూనియర్ కళాశాల క్రీడామైదానం వరకు ర్యాలీ
- పాల్గొన్న మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యేలు పొదెం, రేగా, తాటి



ఐక్యతను చాటుతున్న ఆదివాసీ నాయకులు

భద్రాచలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చిన లంబాడీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ జాతి కోసం తాము చచ్చే వరకూ పోరాటం చేస్తామన్నారు. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, గాంధేయ పద్ధతిలో సాగించే ఈ పోరాటంలో ఆదివాసీలకు చెందిన తొమ్మిది తెగల వారు ఐక్యంగా కలిసి పోరాడాలని వారు పిలుపునిచ్చారు. న్యాయబద్ధమైన ఈ ధర్మ పోరాటానికి అన్ని పార్టీలు సహకరించాల్సిన సమయం ఆసన్నదమైందని వారు స్పష్టం చేశారు. ఆదివారం భద్రాచలంలో ధర్మయుద్ధం పేరిట ఆదివాసీలు భారీ ర్యాలీ, బహిరంగ సభను నిర్వహించారు. బూర్గంపాడు మండలం సారపాక నుంచి (మిగతా 6వ పేజీలో)

పట్టుబట్టి.. విజేతలుగా నిలిచి

వీఆర్వో నుంచి గ్రూప్-2 అధికారిగా..



కూసుమంచి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్క గూడెం గ్రామానికి చెందిన కొమ్ము కల్పన గ్రూప్-2 ఫలితాల్లో ఉద్యోగం సాధించింది. కోఆపరేటివ్ ఆ సొసైటీ ఎలో అస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం వరించింది. 2014లో వీఆర్వోగా ఉద్యోగం సంపాదించి నేలకొండపల్లి మండలంలో విధులు నిర్వహించింది. అనంతరం టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చడంతో సీడీపీవోగాను, మహిళ, శ్రీశిశు సంరక్షణ శాఖలో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా ఉద్యోగాలు సాధించగా సీడీపీవోగా జాయిన్ అయింది. గత జూలై 24న ములుగు జిల్లా ఏటూరి నాగారంలో విధులు నిర్వహిస్తుంది. ఆదివారం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. కోఆపరేటివ్ సొసైటీస్‌లో అస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం సంపాదించింది.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



ఖమ్మంఖానాపురంహవేలి : సూర్యాపేట జిల్లా మోతె మండలం అన్నారిగుడేనికి చెందిన పోటు ఉపేందర్‌రావు, సత్యవతిల కుమారుడు పోటు సంకీర్త్ ఇటీవల మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గ్రూప్-1లో ఎంపీడీవోగా, గ్రూప్-2లో ఎక్సైజ్ సీఐగా, గ్రూప్-4లో రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఖమ్మం కలెక్టరేట్‌లో పోస్టింగ్‌లు పొందాడు. వీరు ప్రస్తుతం నేలకొండపల్లి మండలంలో నివాసం ఉంటున్నారు. 2022లో మొదటి సారి గ్రూప్ 1 పరీక్షలో విజయం సాధించానని, రానున్న రోజులలో మెయిన్స్‌లో మంచి ర్యాంక్ సాధించి ఐఏఎస్ కావాలన్నదే నా కోరిక అన్నారు..

సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా



తల్లాడ: గ్రూపు2 ఫలితాలలో మండలం లోని మల్లారం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటేశ్వరరావు సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాడు. తండ్రి వెంకటేశ్వరరావు చిన్నతనంలో మృతి చెందాడు. తల్లి రుక్మిణి ప్రోత్సాహంతో 2018లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించాడు. 2019లో ఫారెస్టుబీట్ ఆఫీసర్‌గా, 2020లో విద్యుత్ రెవెన్యూశాఖలో జూనియర్ అకౌంట్ ఆఫీర్‌గా ఉద్యోగం సాధించాడు. నాలుగో ప్రయత్నంలో గ్రూపు-2లో 387.7మార్కులు పొంది 148ర్యాకు సాధించాడు. నాలుగో ప్రభుత్వం సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకోని యువత రాణించాలని గ్రామస్థులు కోరారు. వెంకటేశ్వరరావును గ్రామస్థులు అభినందించారు.

ఎక్సైజ్ ఎస్ఐగా ...



కామేపల్లి: గ్రూప్-2 ఫలితాల్లో కామేపల్లి మండలం గోవింద్రాల బంజరకు చెందిన గంగవరపు రత్నేశ్వర నాయుడు ఎక్సైజ్ ఎస్ఐగా కొలువు సాధించాడు. గతంలో మూడు ఉద్యోగాలు సాధించాడు. గ్రూప్-1 ఫలితాల్లో ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో ఏటీఓ సెలెక్ట్ అయ్యాడు.

గ్రంథాలయ పాఠకుడిగా...



చుంచుపల్లి: ఏన్కూరు మండలంలోని భగవాన్‌నాయక్ తండా ప్రాంతానికి చెందిన ధరావత్ వెంగళరావు గ్రూప్-2 ఫలితాల్లో అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. కాగా ఉపేందర్ 2020లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం చేసుకుంటూనే కొత్తగూడెం గ్రంథాలయాన్ని కేరాఫ్ అడ్రాస్‌గా చేసుకొని గ్రూప్-2 పరీక్షలో 600 మార్కులకు గాను 377 మార్కులు సాధించి 277 ర్యాంకు సాధించాడు.

పంచాయతీ ఆఫీసర్‌గా...



తల్లాడ: గ్రూపు-2ఫలితాల్లో మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం రామకోటారెడ్డి మండల పంచాయతీ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, పద్మావతి దంపతుల కుమారుడు రామకోటారెడ్డి రెండో ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా గ్రూపు-2లో ఎంపీవో ఉద్యోగం సాధించాడు.

గ్రూప్-2లో ఎంపికైన మణుగూరు వాసి



మణుగూరు: మణుగూరు పట్టణం అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన సింగరేణి ఉద్యోగి వనపర్ల అభిలాష్ గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 86వర్యాంకు ను సాధించి కమిషనర్‌గా ఎంపికయ్యాడు. 2016లో సింగరేణిలో సినియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాన్ని సాధించాడు. మణుగూరు ఏరియాలోని కొండాపురం యూజీ మైన్‌లో సినియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 86వ ర్యాం కు, గ్రూప్- 3లో స్టేట్ 101 వర్యాంకు, గ్రూప్-4లో స్టేట్ తొమ్మిదో ర్యాంకును సాధించాడు.

రెండు ఉద్యోగాలకు ఎంపిక



తిరుమలాయపాలెం: గ్రూపు2 ఫలితాలలో మండంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన కానుగంటి వీరయ్య, మల్లమ్మ కుమారుడు కానుగంటి ఉపేందర్ గ్రూప్-2,3 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. గ్రూప్-2లో 276, గ్రూపు-3లో 249 ర్యాంకు సాధించాడు. గ్రూపు2లో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా ఉద్యోగం సాధించాడు.

తల్లి కష్టంతో....



తల్లాడ: గ్రూపు-2 ఫలితాల్లో మండలంలోని బాలపేట గ్రామానికి చెందిన పడాల రమేష్‌బాబు మండల పంచాయతీ (ఎంపీవో)గా ఎంపికయ్యాడు. రమేష్ బాబు స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 5వతరగతి చదువుతున్నప్పుడు తండ్రి నరసింహారావు అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి సావిత్రి ప్రోత్సాహంతో ప్రస్తుతం గ్రూపు-2లో 373 మార్కులు పొంది 379 ర్యాంకు సాధించి ఎంపీవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

బావ సహకారంతో...



చుంచుపల్లి: ఖమ్మం జిల్లా చింతకాని ప్రాంతానికి చెందిన పోనుగంటి ఉపేందర్‌రావు గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో చిరు ఉద్యోగిగా పని చేసుకుంటూనే కొత్తగూడెం గ్రంథాలయాన్ని ఎంచుకొని చెల్లి భర్త వద్ద కొత్తగూడెంలో ఉంటూ చదువుకున్నాని తెలిపారు. 380 మార్కులు సాధించి 249 ర్యాంక్ సాధించాడు. దీంతో గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు ఆదివారం ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

కోరట్లగూడెం వాసి ఎంపిక



నేలకొండపల్లి: మండల పరిధిలోని కోరట్లగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బచ్చలకూరి చిన్న మైసయ్య కుమారుడు అజయ్‌కుమార్ గ్రూప్-2కు ఎంపికయ్యారు. 1631వ ర్యాంకు సాధించి, హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ అధికారిగా ఎంపికయ్యాడు. గ్రూప్-3లో కూడా మంచి ర్యాంకు వచ్చిందన్నాడు. గ్రూప్-3లో 3009వ ర్యాంకును సాధించినట్లు చెప్పాడు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా..



తల్లాడ, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ కుమారుడు గ్రూప్-2లో ప్రతిభ కనబరిచి సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాడు. తల్లాడ మండలం పినపాక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎక్కిరాల బాబురావు- సరోజినీ దంపతుల కుమారుడు ఎక్కిరాల ప్రశాంత్ గ్రూప్-2 లో 352 మార్కులతో ఎస్సీ క్యాటగిరిలో 1331 ర్యాంకు సాధించి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాడు.

నిరు'ప్రయోగం' కథనానికి స్పందన



కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన " 'నిరు' ప్రయోగం" అనే కథనంపై రాష్ట్ర విద్యాశాఖ స్పందించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ వారు ప్రయోగశాల విధి విధానాలపై ఈ నెల 27వ తేదీన ఉత్తర్వులు జారీ చేయడమే కాకుండా తప్పనిసరిగా ప్రతీ పాఠశాలలో ప్రయోగశాలలు ఉపయోగించుకునే విధంగా తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రతీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణితము, ఫిజికల్ సైన్స్ బయాలజికల్ సైన్స్ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన మాడ్యుల్ రూపొందించారు. ప్రతీ పాఠశాలకు ఈ మాడ్యూల్ 20 పుస్తకాలు తప్పనిసరిగా పంపిణీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ తరగతి గదికి రెండు మాడ్యూల్ ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రతీ అంశము ప్రయోగశాలలో విద్యార్థులతో చర్చించాల్సి ఉంటుంది. అవసరమైన ప్రయోగాలు చేయడమే కాకుండా దానికి సంబంధించిన కంటెంట్ కూడా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తెలియజేయాలి. ప్రతీరోజు చేసే ప్రయోగాలు వాటి వివరాలు ప్రత్యేకమైన రిజిస్టరులో పొందుపరుచుకోవాలి. పాఠశాల స్థాయిలో చేసిన ప్రయోగాలపై వారానికి ఒకసారి సమీక్షించుకోవాలని కోరారు. పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా శాస్త్రీయ భావాలను ఆలోచనలను పరిశీలనను అభివృద్ధి చేయాలి. చేసిన ప్రతీ ప్రయోగంపై విద్యార్థుల అభిప్రాయాలను సేకరించాలి. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి. కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయా పాఠశాలల్లో ప్రయోగాలపై చర్చించి మరింత మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. ప్రతీ పాఠశాలలో ప్రయోగశాలను ఉపయోగించుకునే విధంగా తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నూతన ఆలోచనలతో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు గాని, యాక్టివిటీస్‌ను ప్రోత్సహించడమే కాకుండా ఇతర విద్యార్థులకు ఆదర్శంగా ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. శాస్త్రీయ దృక్పథం, పరిశీలన, నూతన అన్వేషణలు, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలి.

ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆదివాసీ విద్యార్థిని



తల్లితో శ్రీనిధి

దుమ్ముగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండల కొత్తపల్లి గ్రామానికి చెందిన అపకా శ్రీనిధి ఎంబీబీఎస్ సీటు సాధించింది. 1 నుంచి 4వ తరగతి వరకు స్థానిక పాఠశాలలో చదివింది. ఐదు నుంచి పది వరకు రామవరం గురుకులం పాఠశాలలో చదివింది. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 9.7 గ్రేడు సాధించింది. ఎంట్రన్స్ పరీక్షలు రాసి టీటీడబ్ల్యూఆర్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ వరంగల్‌లో సీటు సాధించి ఇంటర్ చదివింది. ఇంటర్‌లో బైపీసీ కోర్సులో 979 మార్కులు సాధించింది. 2025లో నీట్ పరీక్ష రాసి ఆల్ ఇండియా స్థాయిలో 2,09,444 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 4,644 ర్యాంకు దక్కించుకుంది. కౌన్సిలింగ్‌లో భాగంగా మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. శ్రీనిధి తండ్రి రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తల్లి లక్ష్మి కుమారుడు, కూతుర్లను పోషించుకుంటూ వస్తోంది.

ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జూలూరుపాడు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా విధానాలకు వ్యతిరేకంగా తమ పార్టీ ఆధ్వర్యంలో మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో సీపీఎం మాజీ మండల కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ యాసా కొండలరావు 4వ వర్ధంతి వేడుకలను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని కొండలరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించి జెండాను ఎగరవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పార్టీ ఎదుగుదల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొండలరావు ఎన్నో పోరాటాలను నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కొండపల్లి శ్రీధర్, మండల కార్యదర్శి యాసా నరేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ యాసా నందీప్, వల్లమల్ల చందర్‌రావు, కనకరత్నం, సుగుణ, ఊడల వెంకటేశ్వర్లు, బానోత్ మధు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పదేళ్లల్లో ఇవ్వని ఉద్యోగాలను ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చాం

- గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైంది
- లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కళ్ల ముందే కూలిపోయింది
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నాం
- రాజకీయ ఉనికి కోసమే కొందరు యాత్రలు చేస్తున్నారు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



జానకీపురంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బోనకల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే, తాము అధికారంలోకి వచ్చాక గ్రూప్ - 1, 2 పరీక్షలను నిర్వహించి వేలాది మందికి ఇందిరమ్మ రాజ్యంలో ఉద్యోగాలు ఇచ్చామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లా బోనకల్ మండలం జానకీపురం, నారాయణపురం గ్రామాల్లో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని, ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. రూ. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కళ్ల ముందే కూలిపోయిందన్నారు. ఆర్థిక విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు క్యాబినెట్ అంతా కష్టపడి పని చేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. కొందరు రాజకీయ ఉనికి కోసమే యాత్రలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రైతులకు రుణమాఫీ, ఇళ్ల మంజూరు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను పాలన చేపట్టిన కొద్ది నెలల్లోనే అమలు చేసిన ఘనత ఇందిరమ్మ రాజ్యానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకుండా పేదలను ఇబ్బంది పెడితే తాము మాత్రం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్క నియోజకవర్గంలో 3500 చొప్పున ఇళ్లను మంజూరు చేస్తూ దశల వారీగా అందరికీ ఇళ్లను ఇస్తామన్నారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ ఇళ్లను ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరిని తమ కుటుంబంగా భావించి సంక్షేమ పథకాలను వర్తింప చేస్తామన్నారు. రాజకీయ ఉనికి కోసమే కొందరు యాత్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని కార్యక్రమాలు చేస్తున్నా, మధిర నియోజకవర్గంలో రోజువారీ అభివృద్ధి పనుల గురించి రివ్యూ చేస్తుంటానని తెలిపారు. ఎంతో బాధ్యతగా పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తున్నానన్నారు. రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధిలో కలిసి రావాలని ప్రతిపక్ష పార్టీలకు భట్టి సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, డీసీసీబీ, కార్పొరేషన్ చైర్మన్లు దొండపాటి వెంకటేశ్వరావు, రాయల నాగేశ్వరరావు, నూతి సత్యనారాయణ, గాలి దుర్గారావు, కర్నాటీ రామకోటేశ్వరరావు, పైడిపల్లి కిషోర్ కుమార్, చేబ్రోలు వెంకటేశ్వర్లు, సూర్యదేవర సుదాకర్, కరివేద సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

దుమ్ముగూడెం సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో లచ్చిగూడెం వంతెన సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నార్లగూడెంకు చెందిన కొమరం జగదీష్(23) మృతిచెందిన సంఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. జగదీష్ తన ద్విచక్రవాహనంపై లచ్చిగూడెం వైపు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన జగదీష్‌ను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చర్ల మండలం గొమ్ముగూడెంకు చెందిన లహరి అనే వివాహిత సైతం తీవ్రంగా గాయపడింది.

ఎస్టీ జాబితా నుంచి.. లంబాడీలను తొలగించాల్సిందే..

(5వ పేజీ తరువాయి)

భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో తొమ్మిది జాతులకు చెందిన నాయకులు, ఆదివాసీలు పాల్గొన్నారు. అనంతరం రాణిదుర్గావతి ప్రాంగణం(ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం)లో జరిగిన బహిరంగ సభలో మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, రేగా కాంతారావు, తాటి వెంకటేశ్వర్లతో పాటు ఆదివాసీ జేఏసీ నాయకులు మైపతి అరుణ్‌కుమార్, చుంచు రామకృష్ణ, తెల్లం సీతమ్మలు మాట్లాడారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావుతో పాటు ఇతర ఆదివాసీ నాయకులు సుప్రీంకోర్టులో వేసిన కేసుకు సంబంధించి ఇచ్చిన నోటీసులకు దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం పంపాలని కోరారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ తమ ఇద్దరిపై అభ్యంతకరంగా చేసిన వ్యాఖ్యలకు మాజీ ఎంపీ సోయం బాపూరావు ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇదే క్రమంలో బాపురావు పరుష పదజాలంతో పలు వ్యాఖ్యలు చేశారు. 'సీతారాంనాయక్ గారూ.. మీరు సీఎంను, ప్రధానమంత్రిని భయపెట్టవచ్చు కానీ సోయం బాపూరావును భయపెట్టలేరు' అని స్పష్టం చేశారు. ఆదివాసీల గురించి మాట్లాడే ముందు జాగ్రత్తగా మాట్లాడాలని.. ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. నాడు ఆంగ్లేయులకే ఎదురొడ్డి ఎదురించిన జాతి తమ ఆదివాసీ జాతి అని, జాతి కోసం చచ్చే వరకూ పోరాడుతామన్నారు. తమ తర్వాత తమ వారసులు సైతం ఆదివాసీ జాతి కోసం ఉద్యమ పోరాటాలను కొనసాగిస్తారన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లను ఇప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కలిసి నివేదిస్తామన్నారు.



ధర్మయుద్ధం సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సోయం బాపూరావు

దీపావళి తర్వాత ఆదిలాబాద్‌లో.. డిసెంబరు 9న హైదరాబాద్‌లో సభ

దీపావళి తర్వాత ఆదిలాబాద్‌లో ఆదివాసీల సభను భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ సోయం బాపూరావు ప్రకటించారు. అలాగే డిసెంబరు 9న జేఏసీ నాయకులు చుంచు రామకృష్ణ, మైపతి అరుణ్‌కుమార్ ఇతర ఆదివాసీ నాయకులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆరు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించి తమ సత్తా చాటుతామన్నారు. ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలో ఇంత భారీ ఎత్తున ఆదివాసీల సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆదివాసీలందరూ ఐక్యంగా కలిసిమెలిసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నాడు ఆదివాసీల ఆశాజ్యోతి కొమరం భీమ్ ఏ విధంగా తుడుంకొట్టారో మనం కూడా అలాగే కొట్టి సత్తా చాటుదామని ఆయన పిలుపునిచ్చారు.

సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తా..

- పొదెం వీరయ్య
రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్

ఆదివాసీల పోరాటం న్యాయబద్ధమైందని, ఈ పోరాటానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య కోరారు. ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఆదివాసీల ధర్మ పోరాటానికి సహకారం ఉంటుందన్నారు. ఈ పోరాటం ఆదివాసీ జాతి కోసమని, అందరూ ఐక్యంగా కలిసి ముందుకు రావాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. నాడు తెలంగాణను పోరాడి ఏ విధంగా సాధించుకున్నామో.. నేడు కూడా అదే రీతిలో ఆదివాసీలు ఐక్యంగా పోరాడి తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకుంటే బంజారాలు అలాగే పోతారని అన్నారు. ఈ ఉద్యమంలో అందరి పరస్పర సహకారం ఎంతో కీలకమన్నారు. అంతా కలిసి ఐక్యంగా ముందుకు వెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కోయ భాషలో మాట్లాడుతూ.. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఈ ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ ముందుండి నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి తాను అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీలకు చెందిన తొమ్మిది జాతుల నాయకులు, ఆదివాసీలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఆదివాసీల ధర్మయుద్ధం బహిరంగ సభ ఊహించిన స్థాయి కంటే విజయవంతం కావడంతో ఆదివాసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలంలో ఆదివాసీల ధర్మయుద్ధాన్ని పురస్కరించుకొని ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రాచలం సీఐ నాగరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదివాసీ ధర్మయుద్ధం తీర్మానాలివే..

భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన ఆదివాసీ ధర్మయుద్ధం బహిరంగ సభను పురస్కరించుకొని ఆదివాసీ జేఏసీ 13 తీర్మానాలను చేసింది.

- లోక్‌సభలో ఆదివాసీల భాగస్వామ్యం కోసం భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలి
- ఏపీలో ఏడు విలీనమండలాలతో కూడిన పూర్వ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి
- విద్యార్థులు, ఉద్యోగ, ఆశావహుల స్థానిక స్థితిని పెసా గ్రామసభ మాత్రమే నిర్ణయంచాలి.
- షెడ్యూల్ ప్రాంత భూమి ఇతర వనరులను రక్షించడానికి హైడ్రా వంటి అంకితమైన పాలక మండలి సంస్థను ఏర్పాటు చేయాలి.
- ఆర్‌వోఆర్, భూ బదిలీ నిబంధనలపరంగా స్వపరిపాలన నిర్ధారించడానికి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి.
- క్షీణిస్తున్న ఆదివాసీ ఆదిమ సంస్కృతి గిరిజన జ్ఞాన వ్యవస్థను రక్షిచడానికి, పరిరక్షించడానికి పాలక మండలి ఏర్పాటు చేయాలి.
- సమర్థవంతమైన పాలన, సారికతకోసం ప్రత్యేక షెడ్యూల్ ఏరియా జిల్లాలు ఏర్పాటు ఎంతో అవసరం.
- వలస వచ్చిన గొత్తికోయ గిరిజనులను ఎస్టీలుగా పరిగణించాలి.
- సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చూడాలి.
- కోయ, గోండి భాషలను భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలి.
- షెడ్యూల్ గ్రామాలను చేర్చడానికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ స్థానం తప్పనిసరిగా ఆదివాసీలకే కేటాయించాలి.
- షెడ్యూల్ ప్రాంతంలోని అన్ని స్థాయిల్లో స్థానిక ప్రభుత్వ అధిపతులను ఆదివాసీ వర్గాలకు మాత్రమే రిజర్వు చేయాలి.

'వ్యూ'హరచన!

(5వ పేజీ తరువాయి)

ఎస్టీ అభ్యర్థి ఎవరన్నది కీలకంగా మారింది. జిల్లా మొత్తమ్మీద 20మండలాలకు గాను 20 జడ్పీటీసీల్లో ఎస్టీ జనరల్2, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 2, ఎస్సీ మహిళ 2, బీసీ జనరల్ 4, బీసీ మహిళ 4, జనరల్ 2, జనరల్ మహిళ 2 రిజర్వ్ అయ్యాయి. అదే విధంగా జిల్లాలో ఎంపీపీ చైర్మన్ పదవులు విషయంలో కూడా ఆసక్తి నెలకొంది. ఎంపీపీలకు ఎస్టీ జనరల్3, ఎస్టీ మహిళ3, ఎస్సీ జనరల్2, ఎస్సీ మహిళ2, బీసీ జనరల్4, బీసీ మహిళ 4, జనరల్ 2, జనరల్ మహిళ 1 రిజర్వ్ అయ్యాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జడ్పీ చైర్మన్ పదవి జనరల్ కావడంతో.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా రాజకీయం అంతా భద్రాద్రి జడ్పీ చైర్మన్ పదవిపై ఉంది. అక్కడ ఓసీ అభ్యర్థి జడ్పీ చైర్మన్ కావాలంటే దుమ్ముగూడెం, గుండాల నుంచి పోటీ చేయాలి. జనరల్ మహిళ అభ్యర్థి చైర్మన్ కావాలంటే ఆళ్లపల్లి, టేకులపల్లి నుంచి కూడా పోటీ చేసుకునే అవకాశం ఉంది. అయితే ఇక్కడ జడ్పీ చైర్మన్‌గా ఇతరులకు కూడా అవకాశం ఉన్నప్పటికీ.. ఓసీ అభ్యర్థికే రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వనున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు విపక్ష పార్టీలు కూడా స్థానిక ఎన్నికలకు అభ్యర్థులను బరిలో దించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. మండల పరిషత్ విషయానికి వస్తే 22మండలాలకు గాను ఎస్టీ జనరల్ 10 ఎంపీపీలకు రిజర్వ్ కాగా.. ఎస్టీ మహిళలకు 10 రిజర్వ్ అయ్యాయి. బీసీ జనరల్ 1, ఓసీ జనరల్ 1 రిజర్వ్ అయ్యాయి. దీంతో ఇక్కడ రాజకీయంగా చైతన్యంగా ఉన్న గిరిజన అభ్యర్థులను బరిలో దించేందుకు రాజకీయ పార్టీలు అన్వేషిస్తున్నాయి. ఆర్థిక బలంతో పాటు రాజకీయ నేపథ్యం, స్థానిక ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లను దృష్టిలో ఉంచుకుని టికెట్లు కేటాయించేందుకు పార్టీలు అన్వేషణ సాగిస్తున్నాయి. మొత్తమ్మీద రిజర్వేషన్ల ప్రకటనలో రాజకీయ పార్టీల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ వస్తే నామినేషన్ వేసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు.. ఇలా అంతా స్థానిక ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించనున్నారు.

కుల నిర్మూలనకు వ్యతిరేకంగా పోరాడాలి

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నానాటికి పెరిగిపోతున్న కుల నిర్మూలనకు వ్యతిరేకంగా పోరాడాలని ఇల్లెందు మాజీ ఎమ్మె ల్యే గుమ్మడి నర్సయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని రాయల వెంకటనారా యణ స్మారకభవనంలో మాస్‌లైన్ ప్రజాపంథా పాలేరుడివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కుల నిర్మూలన వ్యతిరేక సదస్సు బందెల వెంకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇంకా కులవివక్ష సాగుతుందన్నారు. అంటరానితనం పోవాలని దేశంలో కులనిర్మూలన జరగాలన్నారు. కేంద్రంలోని బీజేపీ కులాల మధ్య మత ద్వేషాలు పెంచుతుందన్నారు. జ్యోతీరావు పూలే, బీఆర్ అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని కుల నిర్మూలనకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ సందర్భంగా కులాంతర వివాహం చేసుకున్న దంపతులను ఆశీర్వదించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో గోకినపల్లి వెంకటేశ్వరావు, ఆర్.శివ లింగం, కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు మల్లీడి నాగేశ్వరరావు, ఎస్. వెంకటేశ్వర్లు, పి.వెంకటస్వామి, ఎ.వెంకన్న, జి.సరోజిని పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో నెంబర్ వన్ కావాలనే..

రైతు సంక్షేమం కోసం అనునిత్యం నూతన ఆలోచనలు
2026 జూన్ కల్లా కల్లూరుగూడెం ఫ్యాక్టరీ సిద్ధం
అశ్వారావుపేటలో మరో ఫ్యాక్టరీ ఏర్పాటుకు సమాలోచన
ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి


అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగాల రాఘవరెడ్డి తదితరులు

అశ్వారావుపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్‌లో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లి ఆదర్శంగా నిలిపేలా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనునిత్యం నూతన ఆలోచనలతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆయిల్‌పామ్ పంటలో ఎప్పటికప్పుడు వచ్చే సమస్యలకు పరిష్కారం చూపుతూ రైతు క్షేమం కోసం ఆయిల్‌ఫెడ్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన జీఎం సుధాకర్‌రెడ్డి ఇతర అధికారులతో కలసి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించారు. పలు పామాయిల్ తోటలను సందర్శించారు. అప్పారావుపేట ఫ్యాక్టరీ, అశ్వారావుపేట ఫ్యాక్టరీలను సందర్శించి క్రషింగ్‌లో ఏ విధమైన సమస్యలున్నాయి, వాటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురవడంతో విస్తీర్ణం పెరగడంతో పాటు ఈ ఏడాది పామాయిల్ గెలల దిగుబడి బాగా పెరిగిందన్నారు. కానీ క్రషింగ్ సమయంలో ఫ్యాక్టరీల్లో కొన్ని సమస్యలు వచ్చినా వాటిని అధిగమించి క్రషింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు అన్ని ప్రాంతాల నుంచి వస్తున్న గెలలను అశ్వారావుపేట, దమ్మపేటకు తరలించామన్నారు. తాజాగా సిద్దిపేట ఫ్యాక్టరీ ట్రయల్ రన్‌లో ఉండడంతో తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి వస్తున్న గెలలతో పాటు ఖమ్మం జిల్లాలోని ముదిగొండ, ఖమ్మం, వైరా మండలాల నుంచి వచ్చే గెలలను సిద్దిపేటకు తరలిస్తున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే ఏడాది జూన్ నాటికల్లా ఖమ్మం జిల్లాలోని కల్లూరుగూడెం ఫ్యాక్టరీని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీ పాతది అవ్వడంతో తరచూ మరమ్మతులు అవసరమవుతున్నాయని, వాటిని చేయించడంతో పాటు అదనంగా మరో ఫ్యాక్టరీని నిర్మించాలని ఆలోచిస్తున్నామన్నారు. ఈ మేరకు త్వరలోనే ఆ ప్రక్రియ ప్రారంభవుతుందని తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికతో రైతులకు మేలు జరిగేలా సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళతామన్నారు.

ఆయిల్‌ఫెడ్‌కు రూ.600 కోట్లు అప్పు ఉందని కొందరు ప్రచారం చేస్తున్నారని, కేవలం రూ.60 కోట్లు మాత్రమే అప్పు ఉందని విమర్శించేవారు తెలుసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఫ్యాక్టరీల నిర్మాణం, అభివృద్ధి కోసం మరింత అప్పు తీసుకు రావచ్చునని ఇది తప్పేమీ కాదని చైర్మన్ వివరించారు. వచ్చే ఏడాది కల్లా 10 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన, పొట్టి రకాల మొక్కలను తెప్పించేందుకు శాస్త్రవేత్తలతో చర్చిస్తున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 40వేల మంది రైతులు ఉన్నారని, అందులో 67 మంది పొలాల్లో అక్కడక్కడా ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చినట్టు గుర్తించామని, వారికి తక్షణమే కొత్త మొక్కలు ఇస్తున్నామని, భవిష్యత్‌లో ఆ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆయిల్‌పామ్ గెలల ధర మరింత పెరిగేందుకు రైతులకు మేలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కేవలం 40మంది సిబ్బందితో అభివృద్ధి చేస్తున్న ఏకైక సంస్థ ఆయిల్‌ఫెడ్ అని అన్నారు. ఈ సమావేశంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో పవర్ ప్లాంట్ నిర్మించాలి

చాకలి ఐలమ్మ ముని మనువరాలు శ్వేత


మాట్లాడుతున్న చాకలి ఐలమ్మ ముని మనువరాలు శ్వేత

పాల్వంచటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాల్వంచలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మించాలని చాకలి ఐలమ్మ ముని మనువరాలు శ్వేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నయ్యతో కలిసి పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాల్వంచలో తీసివేసిన పాత ప్లాంట్ స్థానంలో మరో ప్లాంట్‌ను నిర్మించి నిరుద్యోగ సమస్యను రూపుమాపాలని అన్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి పాల్వంచ కేంద్రంగా నీరు, బొగ్గు, స్థలం, మ్యాన్‌పవర్ తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రత్యేకత కలిగిన పాల్వంచ మరింత అభివృద్ధి పథంలో సాగాలంటే మరిన్ని పరిశ్రమలు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ తెలంగాణ మహిళా పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ముని మనువరాలు చిట్యాల శ్వేత సైతం అదే పోరాట స్ఫూర్తిని ప్రదర్శించడం అభినందనీయం అన్నారు. ఈ సమావేశంలో జాతీయ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కర్‌రావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నూతన్, నాయకులు కాంపాటి దుర్గాప్రసాద్, మహేష్, చెరుకు అశోక్, మధు, రెడ్డిరాజుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ సర్వేపై ఆర్డర్ కాపీ ఇస్తేనే దీక్ష విరమిస్తాం

ఏడో రోజూ నిరాహార దీక్ష చేస్తున్న రామన్నగూడెం ఆదివాసీలు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గంలోని రామన్నపేట ఆదివాసీలు కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరాహార దీక్ష శిబిరాన్ని అశ్వారావుపేట తహసీల్దార్ సీహెచ్ రామకృష్ణ ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సర్వేనెంబర్ 30, 36, 39లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 6వ తేదీన అటవీ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. నిరాహార దీక్షను విరమించాల్సిందిగా ఆయన ఆదివాసీలను కోరారు. దీనికి ఆదివాసీలు అంగీకరించక పోవడంతో పాటు కలెక్టర్ సర్వేపై ఉత్తర్వులు ఇచ్చిన తర్వాతే దీక్ష విరమిస్తామని వారు భీష్మించారు. గతంలో అనేకసార్లు హామీలు ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదని, అటవీ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే చేస్తామని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినపుడు మాత్రమే దీక్ష విరమిస్తామని వారు తెలిపారు.

ఘనంగా సంజ్ఞా భాషా దినోత్సవం


కలెక్టరేట్ కార్యాలయంలో చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న జిల్లా అధికారులు

కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సంజ్ఞా భాషా దినోత్సవ వేడుకలను ఐడీవోసీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత, లెనినా కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ సంకేత భాష పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఏడాది నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సొసైటీలో బధిరులకు విద్య, ఉద్యోగాల్లో న్యాయం జరిగేలా చూస్తామని, అర్హులైన అందరికీ సహాయ ఉపకరణాలు అందిస్తామన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమున్నా తెలియజేసినట్లయితే కలెక్టర్‌కు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వివరించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బధిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి మాట్లాడుతూ బధిరిలు ఎక్కడికి వెళ్లినా సాంకేతిక భాషా విషయంలో తమ సమస్యను పక్కవారికి చెప్పుకోలేక బాధపడుతున్నారని అన్నారు. అధికారులు అందరికీ సైగల భాషపై అవగాహన కల్పించాలని అన్నారు. వికలాంగుల నియామకాల్లో రిజర్వేషన్లను భర్తీ చేయాలని కోరారు. బధిరులకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, మహిళలకు కుట్టుమిషన్, కంప్యూటర్ శిక్షణలు ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మాలలకు తీరని అన్యాయం

ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానం సవరణే మా లక్ష్యం
నవంబర్ 2న హైదరాబాద్‌లో మాల మహారణభేరి
మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

మణుగూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానం సవరణే మా లక్ష్యం.. మాలలను అందరినీ ఏకంచేస్తున్నాం.. నవంబర్ 2వ తేదీన హైదరాబాద్‌లో మాలమహా రణభేరి ద్వారా మాకు జరుగుతున్న అన్యాయం ప్రభుత్వాలకు తెలియజేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తెలిపారు. ఆదివారం మణుగూరులో రాష్ట్ర నాయకులతో కలసి పర్యటించడగా మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2011 లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానం పెట్టడం ఏమాత్రం సరికాదన్నారు. దీనివల్ల మాలలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోంది. ఈ మేరకు రోస్టర్‌విధానాన్ని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఉద్యమాలను చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా నవంబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహించే మాలమహా రణభేరికి మాలలంతా వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

మలమహానాడు నూతన కార్యాలయం ప్రారంభం

మణుగూరు పట్టణంలో మాల మహానాడు మండల నూతన కార్యాలయాన్ని జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయనతో పాటు రాష్ట్ర నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, మద్దెల జార్జి, వేర్పుల నరేష్, మద్దెల భద్రయ్య, సతీష్ తదితరులు మాట్లాడారు. మాలలకు జరిగిన అన్యాయంపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజిత్, జిల్లా అధ్యక్షుడు నవతన్, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దెల శివకుమార్, మండల నాయకులు వేల్పుల నరేష్, ఎస్సీ సెల్ డివిజన్ నాయకులు మద్దెల భద్రయ్య, సతీష్, వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఓటర్లు లేకుండానే బీసీ రిజర్వేషన్ ఖరారు



మంగళ తండా

కూసుమంచి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రక్రియలో సిత్రాలు చోటుచేసుకున్నాయి. తండాలో బీసీలు లేకుండానే అధికారులు బీసీ మహిళ రిజర్వేషన్ కేటాయించారు. కూసుమంచి మండలంలోని మంగళతండా గ్రామపంచాయతీలో ఈ పరిస్థితి చోటుచేసుకుంది. తండా మొత్తం గిరిజన ప్రాంతం. ఎస్టీ సామాజిక వర్గం ఎక్కువగా ఉంటుంది. అయితే ఇటీవల అధికారులు రొటేషన్ పద్ధతిలో ఈ పంచాయతీ బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారైంది. తండా మొత్తం వెతికినా బీసీ ఓటర్లు లేరు. దీంతో వివిధ రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 500 జనాభా కలిగిన తండాలన్నీ గ్రామపంచాయతీలుగా ప్రకటించింది. ఈ క్రమంలో తండాలన్నీ ఎస్టీలకు రిజర్వ్ చేయాల్సి ఉండగా రిజర్వేషన్లు పేరుతో ఇతర కులాలకు కేటాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగలితండాలో మొత్తం 828 మంది ఓటర్లు ఉన్నారు. అందులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఇద్దరు ఉండగా ఇతర కులాల వారు ఎవరూ లేరు. దీనివలన ఎన్నిక ఆగిపోతుంది. అలాంటప్పుడు పంచాయతీలుగా ప్రభుత్వం ప్రకటించి ఉపయోగం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా సంధ్య తండ, కోక్యాతండ, లింగారాం తండాల్లో నూరు శాతం ఎస్టీలు ఉండగా వాటిని ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ టెక్నికల్‌గా తాము చేసింది సరైందేనని చెపుతున్నారు. ఎస్టీ రిజర్వేషన్ ప్రకారం పూర్తి కావడంతో మిగిలిన వాటిని రొటేషన్ ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిపారు.

రిజర్వేషన్ మార్చాలి

మంగలితండా రిజర్వేషన్ మార్చాలని తండావాసులు కోరుతున్నారు. ఈమేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు.

మారథాన్‌లో మనోడే హీరో..

ఇంటెలిజెన్స్‌లో ఎస్ఐగా ఉంటూనే...
150పథకాలు సాధించి..
డిపార్ట్‌మెంట్‌కే స్ఫూర్తినిచ్చిన వ్యక్తి
రిటైర్‌మెంట్ సందర్భంగా సొంతగ్రామం ముచ్చర్ల నుంచి ఖమ్మం వరకు (21కి.మీ) మారథాన్


మార్గమధ్యంలో స్వాగతం పలుకుతున్న అడిషనల్ ఎస్పీ రామోజు రమేష్

కామేపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మారథాన్.. ఒక సుదీర్ఘమైన పరుగుల పోటీ, శారీరక, మానసిక దృఢత్వం, కఠోర శ్రమ, సమయ నిర్వాహణ స్థిరమైన అంకిత భావం ఉంటేనే విజయం వరిస్తుంది. ఇప్పుడున్న సమాజంలో యువకులు పరిగెత్తలేక అలసిపోతుంటే ఆయన 60ఏళ్ల వయసులో కూడా అలుపెరగని పరుగుతో ఆదర్శంగా నిలుస్తున్నాడు సిరిపురపు పుల్లయ్య. ఇంటెలిజెన్స్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూనే రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి మారథాన్ పోటీల్లో రాణిస్తున్నాడు. ఇప్పటివరకు మారథాన్, అథ్లెటిక్స్‌లో 150పథకాలు సాధించి పోలీస్ డిపార్టమెంట్‌కే స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. సిరిపురపు పుల్లయ్య స్వగ్రామం కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామం. ఈ నెలాఖరున రిటైర్మెంట్ ఉండగా సొంత గ్రామంపై మక్కువతో ఆదివారం ముచ్చర్ల గ్రామంలో తన ఇంటి నుంచి సర్దార్ పటేల్ స్టేడియం వరకు (21 కి.మీ) లయన్స్ క్లబ్ రన్నర్స్‌తో కలిసి మారథాన్ పరుగు ఆరంభించాడు. ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ఎన్నిఒత్తిళ్లు ఉన్న వైద్యుల సూచనమేరకు పరుగులు, ఈత, టెన్నీస్, యోగా, వ్యాయామం చేస్తేనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని తెలిపాడు. మార్గమధ్యంలో మారథాన్‌లో ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ రామోజు రమేష్, డీఎస్పీ వెంకన్నబాబు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో ఇంటిలిజెన్స్ అధికారులు వైవీ.ప్రసాద్, శ్రీనివాసరావు, జెడ్ ఎస్ఐ రహీం, అమరయ్య, నర్సింహారెడ్డి, సురేస్, స్నేహ సాగర్, దస్తగిరి, రాధాకృష్ణ, ఆదినారాయణ, కొండల్, జాఫర్, రంగారావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ముగ్గురు జీఎంల బదిలీలు

రుద్రంపూర్ (సింగరేణి), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలోని ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు జనరల్ మేనేజర్లను బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగూడెం కార్పొరేట్‌లో ఈ అం డ్ ఎం విభాగంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సోమయాజుల వి.రమణ మూర్తిని సీహెచ్‌పీఎస్‌కు బదిలీ చేశారు. ఎస్‌టీపీపీ జైపూర్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కొండారెడ్డి శ్రీనివాసులను డబ్ల్యూఎస్ అండ్ ఈఎం కార్పొరేట్‌కు బదిలీ చేయగా ఎస్టీపీపీ జైపూర్‌లో జనర ల్ మేనేజర్‌గా పనిచేస్తున్న మండల న రసింహారావును ఎస్టీపీపీకి బదిలీ చేశారు. ఎస్టీపీపీ జైపూర్‌లో ఏజీఎంగా పనిచేస్తున్న మధన్ మోహన్‌ను ఎస్టీపీపీ (పీసీఎస్)కు బదిలీ చేశారు.

అనుమతి లేని ఇసుక లారీల సీజ్

దమ్మపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని కొవ్వూరు నుంచి తెలంగాణలోని నల్గొండ జిల్లాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను దమ్మపేట పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముష్టిబండ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి దాబా హోటల్ వద్ద నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక లారీలను గుర్తించి దమ్మపేట స్టేషన్‌కు తరలించారు. పోలీసుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి మూడు ఇసుక లారీలను సీజ్ చేశారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

మణుగూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఓ బాలుడిని వీధికుక్కలు కరిచాయి. ఈ సంఘటన మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని సుందరయ్యానగర్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా.. బిల్లా సీతారాముడు కుమారుడు జశ్వంత్(6) ఇంటి బయట ఆడుకుంటుండగా వీధికుక్కలు వెంటబడి బాలుడి తోడ భాగంలో కరవడంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స చేయించారు. పలు వీధుల్లో కుక్కలు సైర్య విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎక్కువగా చిన్న పిల్లలు కుక్కల దాడులకు గురవుతున్నారు. ఈ విషయంపై పలు ఫిర్యాదులు చేసినా మునిసిపాలిటీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

దుమ్ముగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యల కారణంగా ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండంలోని బొజ్జిగుప్పకు చెందిన వివాహిత కొమరం రమణ(43) శనివారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగగా, ఆదివారం ఉదయం విషయం వెలుగు చూసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండగా, కొంతకాలంగా భర్త నుంచి వేరుగా ఉంటుంది. ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన 'ఆనందోబ్రహ్మ'


జబర్దస్త్ టీం హాస్యవల్లరి

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో మొగిలి ఎంటర్టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆనందోబ్రహ్మ కామెడీ హంగామా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. జబర్దస్త్, డ్రామా జూనియర్ కళాకారులు అప్పారావు, గడ్డం నవీన్, మోహన్‌ల హాస్యం, డ్రామా జూనియర్ వండర్ కిడ్ గుణసాయిల స్కిట్‌లతో అలరించాయి. సంతోష్ డ్యాన్స్ అకాడమీ వారిచే డ్యాన్స్‌లు, బేబీ సుప్రజచే భరతనాట్యం, మిమిక్రీ సుధాకర్‌చే మిమిక్రీ తదితరులతో పాటు మరెన్నో హాస్య కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తొలుత నిర్వాహకులు మొగిలి గుణకర్, సీనియర్ నటులు కాంతేశ్వరరావులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా న్యాయవాది జల్లా లక్ష్మీనారాయణ, మిత్రా గ్రూప్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, హార్వెస్ట్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి మల్లేశం, పలువురు వైద్యులు, ప్రముఖులు హాజరై మాట్లాడారు. సీనియర్ గాయకులు వంజా మాలతి, ఎస్వీ రమణ, శేఖర్‌బాబు, సత్యానందం తదితరలు పాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఉరి వేసుకొని షిర్డీలో యువ వైద్యుడి ఆత్మహత్య

రాయనపేటలో విషాద ఛాయలు


వినోద్ (ఫైల్)

బోనకల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయనపేట గ్రామానికి చెందిన యువ వైద్యుడు ఆదివారం మహారాష్ట్రలోని షిర్డీలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మరీదు కిషోర్, కోటేశ్వరి దంపతుల ఏకైక కుమారుడు వినోద్(30) రష్యాలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేశాడు. పీడియాట్రిక్‌లో ఎండీ చేసేందుకు గానూ మహారాష్ట్రలోని షిర్డీలో ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో చేరాడు. ఈ మేరకు ఆరు నెలల్లో కోర్సు పూర్తి కానుంది. ఈ క్రమంలో వైద్య కళాశాలలో హెడ్ ఆఫ్ డిపార్టమెంట్ విభాగంలో కొందరు వేధింపులకు గురి చేయడంతో మనస్తాపానికి గురైన వినోద్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు కష్టపడి అప్పు చేసి ఎన్నో ఆశలతో కుమారుడిని ఎంబీబీఎస్ కోర్సును పూర్తి చేయించారు. పీజీ కూడా పూర్తి చేయించి వైద్యుడిగా చూసుకుందామనుకున్న వారి ఆశలు అడియాశల య్యాయి. వినోద్‌కు సౌమ్యుడిగా పేరుండటంతో పాటు సున్నిత మనస్కుడు కావడంతో ఒత్తిడిని తట్టుకులేక ఆత్మహత్యకు పాల్పడటంతో రాయనపేటలో విషాద ఛాయలు అలుము కున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిర్వహించిన అనంతరం రోడ్డు మార్గాన బోనకల్ మండలం రాయనపేటకు తీసుకువస్తున్నారు. యువ వైద్యుడి అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322. ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు నం.1) శ్రీ పి.వెంకట రమణ భాస్కర్ తండ్రి పి.వి.ఎస్.ఆర్.మూర్తి, 7-231-11/3, రెవెన్యూ కాలనీ, 2వ లేన్, ఎస్ఎస్ఎన్ కాలేజీ సమీపాన, శివాజీ నగర్, మంగమూరు డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. నం.2) శ్రీమతి పాటిబండ లక్ష్మి శ్యామల, భర్త పి.వెంకట రమణ భాస్కర్, 7-231-11/3, రెవెన్యూ కాలనీ, 2వ లేన్, ఎస్ఎస్ఎన్ కాలేజీ సమీపాన, శివాజీ నగర్, మంగమూరు డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001 వారి నుండి 21.07.2025 నుండి దార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, బకాయితో కలిపి 20.07.2025 నాటికి రూ.3,03,64,568/- (రూపాయలు మూడు కోట్ల మూడు లక్షల అరవై నాలుగు వేల ఐదు వందల అరవై ఎనిమిది మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002, క్రింద, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు
షెడ్యూలు-సి: (శ్రీమతి పాటిబండ లక్ష్మి శ్యామల, భర్త పి.వెంకట రమణ భాస్కర్‌కు చెందిన ఆస్తి)

ఐటం-1: (డాక్యుమెంట్ నం.1388/2006) ఖమ్మం జిల్లా రిజిస్ట్రేషన్, కల్లూరు సబ్-రిజిస్ట్రార్, తల్లాడ మండలం, తల్లాడ పంచాయతీ, తల్లాడ రెవెన్యూ సర్వే నం.175, విస్తీర్ణం ఎ.0.29 కుంటలు మరియు సర్వే నం.176/ఎ, విస్తీర్ణం ఎ.0.03 కుంటలు కలిగిన మొత్తం విస్తీర్ణం సింగిల్ ఐటం గల విస్తీర్ణం ఎ.0.32 కుంటలు గల ఖాళీ స్థలం. షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: గుంటి చెరువు, దక్షిణం: పాటిబండ లక్ష్మి శ్యామల స్థలం, పశ్చిమం: రోడ్, ఉత్తరం: గుంటిపల్లి వెంకటయ్య ఇల్లు, ఇందులోని సరిహద్దులు విస్తీర్ణం ఎ.0.32 కుంటలు లేదా 3872 చ.గ.లు లేదా 3252.48 చ.మీ.ల స్థలం.

ఐటం-3: (డాక్యుమెంట్ నం.1385/2006) ఖమ్మం జిల్లా రిజిస్ట్రేషన్, కల్లూరు సబ్-రిజిస్ట్రార్, తల్లాడ మండలం, తల్లాడ పంచాయతీ, తల్లాడ రెవెన్యూ సర్వే నం.177/బి, వద్ద గల ఖాళీ స్థలం, షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: గుంటి చెరువు, దక్షిణం: గురిజాల అనసూయ స్థలం, పశ్చిమం: పాటిబండ లక్ష్మి శ్యామల స్థలం, ఉత్తరం: పాటిబండ లక్ష్మి శ్యామల స్థలం, ఇందులోని సరిహద్దులు విస్తీర్ణం 1,936 చ.గ.లు లేదా 1,626.24 చ.మీ.ల స్థలం.

ఐటం-4: (డాక్యుమెంట్ నం.1387/2006) ఖమ్మం జిల్లా రిజిస్ట్రేషన్, కల్లూరు సబ్-రిజిస్ట్రార్, తల్లాడ మండలం, తల్లాడ పంచాయతీ, తల్లాడ రెవెన్యూ సర్వే నం.177/ఎ, వద్ద గల ఖాళీ స్థలం, షెడ్యూలు ఆస్తి సరిహద్దులు: తూర్పు: గుంటి చెరువు, దక్షిణం: పాటిబండ లక్ష్మి శ్యామల స్థలం, పశ్చిమం: గొల్లగూడెం రోడ్, ఉత్తరం: పాటిబండ లక్ష్మి శ్యామల మరియు ఇతరుల స్థలం, ఇందులోని సరిహద్దులు విస్తీర్ణం 2,420 చ.గ.లు లేదా 2,032.8 చ.మీ.ల స్థలం.

రిజర్వు ధర: రూ. 85,00,000/-
(రూపాయలు ఎనభై ఐదు లక్షలు మాత్రమే) (ఐటం -1, 3 & 4 కొరకు మాత్రమే)

రీ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
24-10-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం శాఖ, 1-7-64 & 65, ట్రంక్ రోడ్, ఖమ్మం-507003. టెలిఫోన్ నం.08742-238223, సెల్ నం.9346857102

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం శాఖ, 1-7-64 & 65, ట్రంక్ రోడ్, ఖమ్మం-507003 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీలు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08742-238223, సెల్ నం.9346857102లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికి అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 26-09-2025 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

LAND REQUIRED
★ భూమి కావలెను 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సం॥ప్ర॥ 9440522536, 7013226716
AJW-243433

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వదేశాగమనము/ విదేశీయానం. | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి
పదవీవిరమణ | వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు

4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only

ఖమ్మం : 9985401672
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347



గ్రూప్-1కు ఖుశీల్‌వంశీ ఎంపిక



తిరుమలాయపాలెం, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన కొత్తపల్లి ఖుశీల్‌వంశీ గ్రూప్-1 ఫలితాల్లో జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 63ర్యాంకు సాధించాడు. రిజర్వేషన్ కేటగిరిలో 3వర్యాంకు సాధించాడు. హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ములుగు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగ నియామకపత్రం అందుకున్నాడు. ఇతను గతంలో కూడా వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు శివకుమార్-రేణుకలు .

ధరల నియంత్రణ దిశగా..

- గాడిలో పడిన వీధి వ్యాపారుల ప్రాంగణం
- అద్దెలు చెల్లించేందుకు ముందుకువచ్చిన వ్యాపారులు
- అవగాహన కల్పించిన అధికారులు



నూతన విధానాలను వివరిస్తున్న టీఎంసీ గుడిపూడి సుజాతరాణి

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒక వైపు ఐదేళ్ల కూరగాయల దందాగిరికి కళ్లెం పడింది. మరో వైపు అనధికారిక వ్యాపారం నుంచి అధికారికంగా గుర్తింపు కార్డులు పొంది లైసెన్స్ వ్యాపారం కూరగాయలు అమ్మకాలు జరుపుకునేందుకు వ్యాపారులు ముందుకువచ్చారు. పది రోజుల క్రితం కూరగాయల ధరలు అడిగిన వినియోగదారులపై దాడులు చేసిన మార్కెట్‌లో, ఇప్పుడు ధరల బోర్డుపై ఉన్న కూరగాయాల ధరల మేరకు ఇవ్వాలని వినియోగదారులే వ్యాపారులను నిలదీసే పరిస్థితి. ఖమ్మం పాత బస్టాండ్ సెంటర్ సమీపలోని ఖమ్మం నగర పాలక సంస్థ కూరగాయల (వీధి వ్యాపారుల ప్రాంగణం)మార్కెట్‌లో కనిపించింది. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి కూరగాయలు కొనుగోలు చేసే కిరాణా వ్యాపారుల నుంచి నగరంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

2020వ సంవత్సరంలో ఖమ్మం నగరంలోని వీధుల వెంట వ్యాపారం చేసే వారిని ఒకే ప్రాంతంలో కూరగాయాలు అమ్మకాలు జరుపుకునేందుకు ఎంతో విలువైన పాత బస్టాండ్ సమీపంలోని ప్రాంతంలో వీధి వ్యాపారుల ప్రాంగణం ప్రారంభించారు. ప్రారంభించిన కొన్ని రోజులకే ఏర్పాటు లక్ష్యం దెబ్బతింది. కొన్ని కుటుంబాల వారికే వీధి వ్యాపారుల ప్రాంగణం అంకితమైంది. దీంతో పాటుగా ధరలు అడిగిన వినియోగదారులపై దాడులు జరగడంతో అనేక కేసులు వ్యాపారులపై నమోదు జరిగాయి.

అయితే ఇటీవల మార్కెట్‌లో జరుగుతున్న సంఘటనలపై ఆంధ్రజ్యోతి వరస కథనాలు ప్రచురించటంతో స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ, కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. వీధి వ్యాపారుల ప్రాంగణంలో పారదర్శకంగా కూరగాయల అమ్మకాలు జరపాలని, వ్యాపారులకు గుర్తింపు కార్డులను అందించి క్రమపద్ధతిలో నిబంధనల మేరకు వ్యాపారం జరిపేలా మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణికి ఆదేశాలిచ్చారు. దీంతో మెప్మా టీఎంసీతో పాటుగా మార్కెటింగ్ ఎస్టేట్ అధికారి సొల్లేటి శివరామకృష్ణ పది రోజులు పాటుగా కష్టపడ్డారు. వాస్తవంగా ఉన్న వ్యాపారులను గుర్తించారు. ఒకే కుటుంబంలో ఉన్న వారు ఎన్ని దుకాణాలు నిర్వహిస్తున్నారనే వివరాలను సేకరించారు. సుమారు 200 మంది వ్యాపారుల నుంచి వివరాలు సేకరించి వారి ఆధార్‌లను పరిశీలించారు.

అధికారికంగా దుకాణాల కేటాయింపుతో హర్షం

వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఐదేళ్లుగా కూరగాయాలు అమ్మకాలు చేస్తు న్న వ్యాపారులకు అధికారికంగా దుకాణాలు గుర్తింపు లేదు. కొంతమంది చేతిలోనే మార్కెట్ నియంత్రణ ఉందని వ్యాపారుల మధ్య అంతర్గతంగా గొడవలు జరిగాయి. అయితే గత పది రోజులుగా జరుగుతున్న పరిణామాలకు వ్యాపారులు సానుకూలంగా స్పందిస్తున్నారు. కేఎంసీ కంట్రోల్‌లోకి మార్కెట్ రావడంతో అధికారికంగా దుకాణాలు గుర్తింపు జరుగుతాయని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. తమకు గుర్తింపు కార్డులు దుకాణాలపై పూర్తిస్థాయిలో హక్కులు, మార్కెట్‌ను క్రమపద్ధతిలో అభివృద్ధి జరిపితే అద్దెలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు.

అక్టోబరు 1 నుంచి అద్దెలు

ఆదివారం వీధి వ్యాపారుల ప్రాంగణంలో మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ అధికారి శివరామకృష్ణ వ్యాపారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అద్దెలు చెల్లించి అధికారికంగా దుకాణాలు తీసుకోవటం ద్వారా జరిగే హక్కులను వివరించారు. తర్వాత మైక్‌లో నిబంధనలు వివరించారు. అక్టోబరు 1 నుంచి ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు తీసుకునే నిర్ణయాల మేరకు వ్యాపారం నిర్వహించాలని సూచించారు. మార్కెట్ కమిటీ మేరకు వ్యాపారాలు చేపట్టాలని ఆదేశించారు. సీవో గోప్పాసి ఉపేంద్ర, ఆర్పీలు సునిత, ఉమా, జవాన్ నాగరాజు పాల్గొన్నారు. డీఆర్ఎఫ్ బలగాలు అధికారులకు భద్రత కల్పించారు.

నెలకు రూ.12 లక్షల వరకు ఆదాయం

వీధి వ్యాపారుల ప్రాంగణంలో మొత్తం 200లకు పైగా వ్యాపారులు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కూరగాయాలు అమ్మకాలు జరుపుతున్నారు. నగరంలోని ఇతర మార్కెట్‌లో ఒక్కో దుకాణానికి కనీసంగా రూ.5వేలు అద్దెను నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారు. వీధి వ్యాపారుల దుకాణంలోను ఆదే విధానాన్ని అమలు చేస్తే ఖమ్మం నగర పాలక సంస్థకు నెలకు రూ.12 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేశారు.

సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తిగా సాగుదాం



మాట్లాడుతున్న వంగూరి వెంకటేష్

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తిగా సమాజం కులమతాలకు అతీతంగా ముందుకు సాగాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేశ్ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సత్యశోధక్ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు కీర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, సహాయ కార్యదర్శి యశ్వంత్, పృథ్వీ, సందీప్, సురేష్ కార్తీక్, అన్వేష్, తదితరులున్నారు.

నిందితులను గుర్తించి శిక్షించాలి



చనిపోయిన చేపలను చూపిస్తున్న సొసైటీ సభ్యులు

కామేపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చెరువులో విష ప్రయోగం చేసిన నిందితులను గుర్తించి శిక్షించాలని పింజరమడుగు మత్స్య సహకార సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం చేపల చెరువు వద్దకు వెళ్లగా మృతిచెందిన చేపలను చూసి బోరున విలపించారు. ప్రభుత్వం నిందితులను గుర్తించి శిక్షించి తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, కిన్నెర రామచంద్రయ్య, డేగల రాంబాబు, డేగల పోతయ్య, వీరబాబు, శివకృష్ణ, నరేష్, కొండలు, బాబు ఉన్నారు.

పేదలకు అండగా వాసవీ క్లబ్ సేవలు



సమావేశంలో పాల్గొన్న వాసవీ క్లబ్ సభ్యులు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చుతూ వారికి అండగా ఉంటున్న వాసవీ క్లబ్ సేవలను మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని క్లబ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్లబ్ ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా రీజియన్, త్రి రీజియన్ చైర్మన్ కొత్తూరు రమేష్, కడివెండి శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, వరప్రసాద్, దివాకర్ గుప్తా, జగన్నాథం తదితరులున్నారు.

సీనియారిటీకి దక్కిన గౌరవం

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నియామకంలో ఎట్టకేలకు సీనియారిటీకి గౌరవం దక్కిందని, ఎస్టీఎఫ్ చేసిన కృషితో న్యాయం దక్కిందని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నియామక ప్రక్రియలో సీనియారిటీని మరచి, మరో వ్యక్తిని నియమించిన సందర్భంగా ఇన్‌చార్జి డీఈవో అదనపు కలెక్టర్‌ను ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందించామన్నారు. సీనియారిటీ విషయమై పరిశీలించాలని జెడ్పీ సీఈవో, ఏఎంవోలను నియమించి పరిశీలించి సినియారిటీని కాదని మరో వ్యక్తిని నియమించినట్లు గుర్తించి నివేదిక ఇచ్చారన్నారు. దీంతో వ్యాయామ ఉపాధ్యాయులు నగరంలోని ఎస్టీఎఫ్ కార్యాలయానికి చేరుకొని రాష్ట్ర అధ్యక్షుడి సైదులుతోపాటు సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేలకొండపల్లి, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్వుమాధారం గ్రామానికి చెందిన విజ్ఞాన్ విద్యా నికేతన్ పాఠశాలలో 2002-2003 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెల్లగొర్ల లింగస్వామి, పున్నయ్య, వెంకటేశ్వర్లు, హిదయతుల్లా, రంగారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాయదారి మహమ్మారి

(5వ పేజీ తరువాయి)

ఎక్కువవుతున్నాయి. ఈ తీరు మరింత ఆందోళనకు గురిచేస్తోంది. వ్యాధి బారిన పడుతున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరగడానికి జీవన శైలిలో మార్పు, మారిన ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, కాలుష్యం వంటి కారణాలే కారణమని వైద్యులు చెబుతున్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించే మహిళలు పలువురు ఉద్యోగాలు సైతం చేస్తున్నారు. దీంతో ఇంటా బయట ఒత్తిడితో తమ ఆరోగ్యంపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలోనే బాధితుల్లో అత్యధికంగా మహిళలు ఉన్నారని తెలుస్తోంది. అంతేకాక క్యాన్సర్ సోకిన విషయం గుర్తించకపోగా, ముదిరాక తర్వాత చేయించినా ఫలితం ఉండడం లేదు. క్యాన్సర్ సోకితే నియంత్రించడం కష్టమైన తరుణాన ముందస్తుగానే కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్సీడీ)లో చేర్చింది. ఈమేరకు 30 ఏళ్లు పైబడిన వారిలో నోటి, రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ సోకితే గుర్తించి ఆయుష్షు పొడిగించేలా చికిత్స అందిస్తున్నారు.

ఘనంగా దేవీశరన్నవరాత్రి పూజలు





జిల్లాలో దేవీనవరాత్రుల వేడుకలలో భాగంగా ఐదవ రోజు శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని స్తంభాద్రి లక్ష్మీ నరసింహ స్వామి భక్త బృందం ఆద్వర్యంలో 21వ వార్షిక శరన్నవరాత్రుల వేడుకలు జమ్మిబండ వద్ద వైభవంగా నిర్వహిస్తున్నారు.. 48వ డివిజన్‌లోని ఎఫ్‌సీఐ రోడ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



పూజలు చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ



కూసుమంచిలో...



తిరుమలాయపాలెంలో...



ఈశ్వరమాధారంలో...

నవ దంపతులను ఆశీర్వదించిన మంత్రి తుమ్మల



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి తుమ్మల

కూసుమంచి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన దంపతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీర్వదించారు. కూసుమంచి మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామ శ్రీను కుమారుడు రామ మనీష్ చౌదరి వివాహం ఉదయశ్రీతో జరిగింది. ఈసందర్భంగా మనీష్ వివాహానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై ఆశీర్వదించారు. అదేవిధంగా గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, పాలేరు క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సాధు రమేష్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

చిన్నారులకు అండగా రోటరీ క్లబ్

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లోని రోటరీ కమ్యూనిటీ సెంటర్‌లో ఆదివారం రోజ్ చారిటబుల్ ఆధ్వర్యంలో పలువురి చిన్నారులకు పాఠశాల సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా క్లబ్ సంస్థాపక అధ్యక్షుడు అమర్నాథ్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ హైద్రాబాద్ సహకారంలో ఆలంబన ప్రాజెక్టు కింద ఖమ్మం జిల్లాలో 30 మంది చిన్నారును చేరదీసి వారికి కావాల్సి సహాయసహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాది వాసు, లోకేష్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు బ్యాగులు అందిస్తున్న దృశ్యం

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) భగత్ సింగ్ స్ఫూర్తితో యువత సామాజికంగా ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ పిలుపునిచ్చారు. ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతిని రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో ఆదివారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ అతి చిన్న వయవస్సులోనే దేశ స్వాతంత్రం కోసం బ్రిటీష్ సామ్రాజ్యశక్తులకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు తన విలువైన ప్రాణాన్ని త్యాగం చేశారన్నారు. నేటి యువత భగత్ సింగ్ స్ఫూర్తిని అలవరచుకొని కేంద్ర, రాష్ట్రాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు ఇస్లావత్ రమేష్, రవి, శివలాల్ పాల్గొన్నారు.



ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

అఖిలభారత విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డాక్టర్స్ మెడికల్ అకాడమీలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, గోపి, పవన్, నరేందర్, స్వాతి, ప్రవల్లిక శిల్ప శిరీష, భవాని, మాధవి పాల్గొన్నారు.

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంపొందించాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రవణ్‌కుమార్, మామిళ్లశ్రీనాద్ రెడ్డి, మామిడాల కిరణ్, ఆముదాల వెంకన్న, రఫీ, వీరబాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు



టీడీపీ కార్యాలయంలో...



సర్వజ్ఞ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



టీఎన్‌జీవో కార్యాలయంలో...



డీసీసీ కార్యాలయంలో



బాలవికాస్ విద్యార్థుల ర్యాలీ


ర్యాలీతీస్తున్న సేవాసంస్థల నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం సత్తుపల్లిలో శ్రీ సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులు ర్యాలీతీశారు. శాఖాహారం తీసుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్లకార్డుల ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. కన్వీనర్ చీకటి రామారావు, తనూజ, వేదవతి, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో పడకేసిన పారిశుధ్యం

- ఎక్కడ వేసిన చెత్త అక్కడే..
- విచ్చలవిడిగా డంపింగ్
- చెరువులు, రోడ్లపై చెత్తాచెదారం
- సిద్దారం కమ్యూనిటీ హాలే పశువులకు ఆవాసం


పశువులకు ఆవాసంగా కమ్యూనిటీ హాల్


కొత్తూరు రైతువేదిక వద్ద చెత్తాచెదారం


మోటారు వద్ద నిలిచిన మురుగునీరు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి పారిశుధ్యం పడకేసింది. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఈ సీజన్‌లో ఆయా శాఖలు బ్లీచింగ్ చల్లుతూ చేతులుదులుపుకుంటున్నట్లుగా గ్రామాల్లో కనిపిస్తోంది. 2024ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయితీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రజాప్రతినిధుల స్థాయిలో ఆలనాపాలన చూసే పరిస్థితి లేకపోవడంతో గ్రామాలలో అపరిశుభ్రత తాండవిస్తుండడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అలాగే డ్రెయినేజీ సరిగా లేక చాలాచోట్ల మురుగు కాలువలలో నీరు వెళ్లే పరిస్థితి లేక అక్కడే నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుందని, స్థానికులు రోగాలబారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. సత్తుపల్లి మండలంలో మొత్తం 21పంచాయితీలలో దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పారిశుధ్య నిర్వహణకు డబ్బులు లేని పరిస్థితి ఉందనే ప్రచారం సర్వత్రా సాగుతుంది. పంచాయితీలలో రూపాయి నిధులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతుండగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాని పరిస్థితి ఉంది. దీంతో చెత్త సేకరణ ట్రాక్టర్లు మూలన పడగా డంపు యార్డులు, వైకుంఠధామాల నిర్వహణ అధ్వాన్నంగా మారి గ్రామాలన్నీ కంపుకొడుతున్నాయి. ఇదే విషయమై ఎంపీడీవో నాగేశ్వరరావును వివరణ కోరగా పరిశీలిస్తామని అన్నారు.

ఎక్కడ పడితే అక్కడే చెత్తాచెదారం

రహదారులకు ఇరువైపులా, చెరువులు, కుంటలు, వాగులలో చెత్తాచెదారాన్ని స్థానికులు, వ్యాపారస్తులు విచ్చలవిడిగా డంప్ చేస్తున్నారు. కొత్తూరు స్మశాన వాటిక వెనుకనున్న డంపింగ్ యార్డులో గ్రామంతో పాటు సమీపంలోని వారంతా చెత్తాచెదారం వేస్తుండడంతో చుట్టుపక్కల మామిడి తోటల రైతులు వెళ్లలేని పరిస్థితి. ఇక రహదారుల వెంట కొందరి నిర్లక్ష్యం కారణంగా ముక్కు మూసుకుని వెళ్లాల్సిందేనని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చిత్తడిగా మారిన గ్రామ శివారులు

ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం వేయడంతో గ్రామాల శివారులు చిత్తడిగా మారుతున్నాయి. ఇటీవల కురిసన వర్షాలకు నీరు నిలిచి దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, విషజ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని సదాశివునిపేట స్కూల్ సమీపంలో డ్రెయినేజీలు లేకపోవడంతో కాలువల్లోనే నీరు భారీగా నిలుస్తోంది. తాగునీటి మోటారు ఉన్న ప్రాంతాల్లో నీరు నిలవడంతో కలుషితం అవుతాయనే ఆలోచన కూడా లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ హాలే పశువులకు ఆవాసం

సిద్దారం గ్రామంలో ఎన్టీఆర్ వరద నీటి కాల్వ పక్కన నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో స్థానికులు పశువులను కట్టివేస్తున్నారు. పారిశుధ్యం తాండవించడంతో పాటు ఆక్రమణకు గురవ్వడం, అసాంఘీక కార్యకలాపాలకు ఆవాసంగా మారిందని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయితీరాజ్ శాఖ డీఈఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్ల వెంట రాళ్ల కుప్పలు

▸▸ మున్సిపల్ పనితీరుపై స్థానికుల విస్మయం



రోడ్ల పక్కన పోసిన రాళ్ల కుప్పలు, రాళ్లను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

వైరా, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారికి రెండు వైపులా మరమ్మతుల పేరుతో రాళ్ల కుప్పలు పోయడం పట్ల స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల వెంట రాళ్లు పోయడం ఇదెక్కడి చోద్యమని మునిసిపాలిటీ తీరును విమర్శిస్తున్నారు. వైరా మునిసిపాలిటీలోని అనేక వీధులు కనీసం నడిచేందుకు వీల్లేని బురద, గోతులతో నిండి ఉన్నాయి. వాటి గురించి ఏమాత్రం పట్టించుకోని మునిసిపల్ అధికారులు శుక్రవారం జాతీయ ప్రధాన రహదారి పక్కన దుకాణాల ముందున్న కొద్దిపాటి గుంతలకు మరమ్మతుల పేరిట గ్రావెల్‌కు బదులు ఒక గుట్ట నుంచి బండరాళ్లను తీసుకువచ్చి పోస్తున్నారు. రెండువైపులా బీటీ రోడ్డు అంచుల్లోనే గుంతల్లో రాళ్లు పోస్తుండడంతో ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మరమ్మతులు కూడా అరకొరగా చేయటాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే ఈ గోతుల మరమ్మతులకు గ్రావెల్‌ను పోయాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా పెద్ద సైజుతో ఉన్న రాళ్లను పోయడంతో అవి రోడ్డుకు రెండువైపులా ప్రమాదకరంగా మారాయి. ఇదెక్కడి చోద్యమని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. కొండ నాలుకకు మందు వేయబోతే అసలు నాలుక కన్పించకుండా పోయిందనే చందంలా మరమ్మతుల పేరిట భారీగా నిధులు ఖర్చుచేస్తూ ప్రజలను, వాహనచోదకులను ప్రమాదంలోకి మునిసిపల్ అధికారులు నెడుతున్నారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. మునిసిపాలిటీకి చెందిన ఎక్స్‌కవేటర్‌తో గుంతల్లో మరమ్మతులు చేసిన తర్వాత రాళ్లు మొత్తం రోడ్డు వెంట ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులకు కనువిప్పు కలగాలని, వాస్తవంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న చోట మరమ్మతులు, పారిశుధ్య పనులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పేద విద్యార్థికి ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సాయం

వైరా, 28 సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న బీద, ప్రతీభా వంతులైన విద్యార్థినీ, విద్యార్థులకు వైరాకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయులు వేమూరి సత్యనారాయణ, స్వరూపా రాణి కుమారుడు వేమూరి సుధీర్ ఆదివారం వైరాలో రూ.65వేల ఆర్థిక సహాయాన్ని వైరాలో లీలా సుందరయ్య నగర్‌లోని వేమూరి సత్యనారాయణ నివాసంలో మండల వైద్యాధికారి డాక్టర్ బత్తినేని శ్రీహర్ష చేతులమీదుగా అందజేశారు.

మెడికల్ విద్యార్థినికి రూ.10వేల అందజేత

ఏన్కూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మెడికల్ సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులతో మండల పరిధలోని రేపల్లేవాడ గ్రామానికి చెందిన విద్యార్థిని నాగేశ్వరికి కొలిశెట్టి నరేష్ ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన మేడి నాగేశ్వరి ఎంబీబీఎస్ సీటు సాధించింది. కనీస ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్న ఆమెకి కొలిశెట్టి నరేష్ రూ.10వేలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చేతుల మీదుగా అందించారు.

గోదాములను తనిఖీ చేసిన రాయల

వైరా, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని సివిల్ సప్లై గోదాములను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆదివారం తనిఖీ చేశారు. గోదాముల్లో బియ్యం నిల్వలు వాటి వివరాలను పరిశీలించారు. సమర్థవంతంగా గోదాముల నర్వహణ ఉండాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పూవాళ్ళ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడకు ఐదోసారి దక్కిన వైస్‌చైర్మన్ పదవి



తల్లాడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి తల్లాడ మండలానికి ఐదోసారి దక్కింది. ఆదివారం వైరా వ్యవసాయమార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ పదవి బాధ్యతలు స్వీకరించారు. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీవైస్‌చైర్మన్ పదవి తల్లాడ మండలానికి ఐదోసారి దక్కింది. గతంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌లుగా తల్లాడ మండలం నుంచి అన్నారుగూడెం గ్రామానికిచెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిరశాల భద్రయ్య, వేమిశెట్టి నాగేశ్వరరావు(నాగన్న), పగడాల లచ్చిరెడ్డి, దుపాటి భద్రరాజు, వైస్‌చైర్మన్‌లుగా పనిచేశారు. ప్రస్తుతం సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి సిఫార్సుతో కాపా సుధాకర్ వైస్‌చైర్మన్‌గా ఎంపికయ్యారు.

బాధ్యతలు చేపట్టిన వైరా ఏఎంసీ నూతన పాలకవర్గం


గంగారావును అభినందిస్తున్న పువాళ్ళ దుర్గాప్రసాద్, ఇతర నాయకులు

వైరా సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణంలోనైనా వచ్చే అవకాశం ఉండడంతో సెలవు దినమైనప్పటికీ ఆదివారం వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆగమేఘాల మీద బాధ్యతలు చేపట్టడం జరిగింది. వైరా మునిసపాలిటి నాలుగోవార్డులోని ద్వారకా నగర్‌కు చెందిన బొళ్ళ గంగారావు ఛైర్మన్‌గా తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. డైరెక్టర్లుగా తోటకూర నాగేశ్వరరావు, పొట్టపల్లి గోపి, ఫునాటి బాబురావు, భానోత్ మురళి కృష్ణ, జాలాది తిరుపతిరావు, కాశిమల్ల వెంకటేశ్వర్లు, షేక్ మౌలాలి, రేచర్ల సత్యం, మొతుకూరి వెంకటేశ్వర్లు, రేచర్ల మలేశ్వరి, ట్రైడర్స్‌గా ఇనుగుర్తి వెంకటనాగేశ్వరరావు, చావా శ్రీనివాస్‌రావులు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఛైర్మన్ గంగారావు డైరెక్టర్లకు కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్ రాయాల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పూవాళ్ళ దుర్గాప్రసాద్ రావు, రాష్ట్రమార్కెఫెడ్ మాజీ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, కట్ల రంగారావు, మండల అధ్యక్షుడు సేలం వెకటనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రత్నం, నాయకులు మచ్చ బుజ్జి, వెంకటేశ్వరావు, రోశయ్య, దొడ్డపుల్లయ్య, ఎడ్లపల్లి వీరయ్య, చౌదరి, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

చిన్నకోరుకొండిలో పూర్వ విద్యార్థుల కలయిక


చిన్నకోరుకొండి సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు

కల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోరుకొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో 2008-2009లో 10వ తరగతి వరకు చదివిన నాటి విద్యార్థులు, గురువులంత ఈ సమ్మేళనానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా నాటి మిత్రులంత 16 సంవత్సరాల తర్వాత మరోసారి పరస్పర పరిచయ కార్యక్రమం నిర్వహించారు. నాటి గురువులు విద్యాబోధన తీరు, తరగతి గదుల్లోని తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా పాటుపడుతూ ఆదర్శంగా నిలిచిన విశ్రాంత ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ గుజ్జు చిన్నపుల్లాదాసు, విశ్రాంత ఏఎస్ఐ కుమ్మరి రామారావుకు నాటి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంత మెమెంటోలను బహుకరించి శాలువలతో సత్కరించారు. అదే విధంగా నాటి గురువులైన పాఠశాల హెచ్ఎం హేమసుందరి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరావు, జడిదా, పద్మ, సీతక్కలను కూడా శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు.

రాగూర్ విద్యాసంస్థల్లో ఘనంగా బతుకమ్మ


బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న యువతులు

వైరా, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల,ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఠాగూర్ కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సంబురాలను విద్యాసంస్థల ఛైర్మన్ వాసిరెడ్డి సునీత పూజచేసి ప్రారంభించారు.ఈసందర్భంగా విద్యార్థినులు రంగురంగులా పూలతో బతుకమ్మను పేర్చి వాటి చుట్టూ నృత్యాలు చేస్తూ బతుకమ్మ పాటలు పాడుతూ అలరించారు.కార్యక్రమంలో డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, కరస్పాండెంట్ పంక్రాంతి రవికుమార్, ఎన్ఎస్ఎస్ పీవో లింగారావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు, అధ్యాపకులు నాగలక్ష్మీ, చైతన్య, లత, మజీద్ పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని వల్లభి శ్రీకోదండరామాలయంలో దుర్గాదేవి అమ్మవారు ఆదివారం వేపకాయల బతుకమ్మ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు రకరకాల పూలతో బతుకమ్మ ఆటపాటలతో ఆడిపాడారు. ఈకార్యక్రమంలో మాజీసర్పంచ్ పోట్ల వెంకటప్రసాద్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

తల్లాడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ ట్రేడ్ యూనియన్ కార్మికులంతా ఐక్యంగా ఉండాలని ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జడల అంజయ్య కోరారు. ఆదివారం తల్లాడలోని ఆర్‌బీ గార్డెనర్‌లో యూనియన్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జడల అంజయ్య జెండా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి వివేక్, ఎమ్మెల్యే రాగమయి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లనుంచి ఎలక్ట్రిషియన్ల యూనియన్ కోసం పోరాడిన పోరటామంతా ఫలించిందని, కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపి ప్రమాదబీమాలో మరణించిన కార్మికులకు రూ.6.30లక్షలనుంచి10లక్షల వరకు పెంచి కార్మికుల కుటుంబాలకు భరోసా ఇచ్చిందన్నారు.

కల్లూరులో రేబిస్ దినోత్సవం


అవగాహన సదస్సులో పశు వైద్యాధికారులు

కల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రేబిస్ వ్యతిరేక దినం సందర్భంగా మండలంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో కుక్కలకు, పిల్లులకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ కె.మమత తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ మమత మాట్లాడుతూ.. రేబిస్ వ్యాధి జూనోటిక్ వ్యాధి అని తెలిపి ఇది కుక్కలు, పిల్లలు కరవడం ద్వారా వాటి లాలాజలంలో ఉండే రాబిడో వైరస్, లిస్సా వైరస్ శరీరంలో ప్రవేశించి ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. కుక్కలకు, పిల్లులకు ప్రతి సంవత్సరం యాంటీ రేబీస్ టీకా వేయించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చాన్నారు. మనుషులను గానీ ఇతర పశువులను గానీ కుక్కలు కరిచినప్పుడు టీకా వేయించకపోతే వ్యాధి లక్షణాలు కనపడితే వారిని కాపాడలేమన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదని, నివారణ మాత్రమే మార్గమన్నారు.

సత్తుపల్లిరూరల్: మనుషులకు కుక్క ద్వారా రేబీస్ సోకితే ప్రాణాంతకమేనని సత్తుపల్లి పశువైద్యశాల సహాయ సంచాలకులు డా.కే.ప్రదీప్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పశువైద్యశాలలో ఉచిత టీకాలతోపాటు అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 43 కుక్క పిల్లలకు యాంటీ రేబీస్ టీకాలు వేయించి యజమానులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు డా.సీహెచ్.శశిదీప్, ఆర్.కిరణ్‌రెడ్డి, నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, వేణు, లయన్స్ క్లబ్ బాధ్యులు గోగడ రమేష్, గంద్ర సోమిరెడ్డి, పెనుగొండ రమేష్, బోయనపల్లి రవికుమార్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సాల్మన్, రెహ్మాన్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కారేపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాగ్యనగర్ తండా నుంచి పోలంపల్లి, బజ్యాతండా నుంచి గొల్లగూడెం గ్రామల మధ్య రూ2.50కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డు పనులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదివారం శంకుస్థానచేశారు. బాగ్యగనర్ తండా నుంచి పోలంపల్లివరకు రూ.1.70కోట్లతో బజ్యాతండా నుంచి గొల్లగూడెం వరకు రూ.80లక్షల వ్యయంతో నూతనంగా బీటీ రోడ్లు ఏర్పాటుచేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామలలోనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనే ధ్యేయంతో అన్ని ప్రాంతాలలో బిటి, అంతర్గత రోడ్లు, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మహిళలు ఏర్పాటు చేసిన బతకమ్మల వద్ద వారితో కలిసి బతకమ్మ ఆడారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏన్కూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా లచ్చిరాంనాయక్


బాధ్యతలు చేపడుతున్న లచ్చిరాంనాయక్

ఏన్కూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన ఛైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుగులోత్ లచ్చిరాంనాయక్ నియమితులయ్యారు. నూతన మార్కెట్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ఆదివారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు మార్కెట్ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. వైస్ ఛైర్మన్ గా మల్కం గంగులు, డైరెక్టర్లుగా రేసు వెంకయ్య, భూక్యా లక్‌పతి, ధరావత్ దేవ్‌సింగ్, బానోతు తావరియా, వసంతశ్రీను, కరపర్తి వెంకటేశ్వర్లు, పరచ రమణ, బానోతు శ్రీను, గుగులోత్ భాగ్య, గుగులోత్ శోభన్, బానోతు నరసింహారావు, బానోతు నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా లచ్చిరాంనాయక్ మాట్లడుతూ.. మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి బజార్, సొసైటీ ఛైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ ప్రహ్లాదరావు, గిద్దగిరి సత్యనారాయణ, పూర్ణకంటి మైసారావు గుర్రం రవి, గాలిబ్‌సాహెబ్, యంద్రాతి సాయి, కట్టా సత్యనారాయణ, చింతనబోయిన సీతారాములు, పంతగాని నరేష్, నవీన్, నల్లమల శివకుమార్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

▸▸ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి


బాధితురాలు విజయలక్ష్మికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత సన్మార్గంలో నడవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి అన్నారు. ఆదివారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. అనంతరం మండలంలోని రేజర్లలో సత్తెమ్మ తల్లి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, నూతనంగా నిర్మితమై దసరా పర్వదినం సందర్భంగా ప్రతిష్ఠ జరుపుకోనున్న దుర్గానాగమల్లేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా యాగశాలలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాగా.. వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన రాంపల్లి ఈశ్వరాచారి ఈ ఏడాది మే 16 తేదీన ఇంటివద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల విలువైన చెక్కును ఎమ్మెల్యే మృతుడి భార్య విజయలక్ష్మికి అందజేశారు.

మాయదారి మహమ్మారి

(5వ పేజీ తరువాయి)

ఎక్కువవుతున్నాయి. ఈ తీరు మరింత ఆందోళనకు గురిచేస్తోంది. వ్యాధి బారిన పడుతున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరగడానికి జీవన శైలిలో మార్పు, మారిన ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, కాలుష్యం వంటి కారణాలే కారణమని వైద్యులు చెబుతున్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించే మహిళలు పలువురు ఉద్యోగాలు సైతం చేస్తున్నారు. దీంతో ఇంటా బయట ఒత్తిడితో తమ ఆరోగ్యంపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలోనే బాధితుల్లో అత్యధికంగా మహిళలు ఉన్నారని తెలుస్తోంది. అంతేకాక క్యాన్సర్ సోకిన విషయం గుర్తించకపోగా, ముదిరాక తర్వాత చేయించినా ఫలితం ఉండడం లేదు. క్యాన్సర్ సోకితే నియంత్రించడం కష్టమైన తరుణాన ముందస్తుగానే కట్టడికి కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్సీడీ)లో చేర్చింది. ఈమేరకు 30 ఏళ్లు పైబడిన వారిలో నోటి, రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ సోకితే గుర్తించి ఆయుష్షు పొడిగించేలా చికిత్స అందిస్తున్నారు.

మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అంబటి


బాధ్యతలు స్వీకరిస్తున్న పాలకవర్గం

చింతకాని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చింతకాని, ముదిగొండ మండలాల్లో రైతాంగ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యంలో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరించారు. అనంతరం పాలకవర్గాన్ని పలు పార్టీల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మత్కేపల్లి ఏఎంసీ వైస్ ఛైర్మన్ పర్సగాని తిరుపతి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి ఆంజనేయులు, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పంతులు నాయక్, పాలకవర్గ సభ్యులు,నాయకులు కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, కిషోర్, నూతలపాటి వెంకటేశ్వర్లు, కిలారు మనోహర్‌బాబు, పెంట్యాల అప్పారావు, నెల్లూరి కోటేశ్వరరావు, సూరారెడ్డి, తోటకూరి ప్రగతి పాల్గొన్నారు.

